www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 30 జూన్ 2023

నేడు భీమవరంలో పవన్‌కళ్యాణ్ బహిరంగ సభ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర మొదటి విడత ముగింపు సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు స్థానిక అంబేద్కర్ సెంటర్లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. అందుకు అనుగుణంగా పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బహిరంగ సభ సందర్భంగా వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. పట్టణంలోకి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించడానికి చర్యలు చేపట్టారు.

పొత్తులు.. సీట్లపై

హాట్‌టాపిక్‌గా జనసేనాని భీమవరం పర్యటన

టిడిపి, జనసేన పొత్తు కుదిరితే ఆశించే నియోజకవర్గాలపై ముందస్తు ఊహాగానాలు

పొత్తులపై సందిగ్ధత.. నేతల్లో అయోమయం

అంతుబట్టని పశ్చిమ రాజకీయం

చర్చోపచర్చలు..!

ప్రజాశక్తి - భీమవరం

వారాహి విజయ యాత్రలో భాగంగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ భీమవరం పర్యటన జిల్లా రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. పొత్తులు, సీట్లపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. టిడిపి, జనసేన పొత్తు కుదిరితే జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు పంచుకుంటారోనని ఎవరికి వారు తోచినట్లు లెక్కలు కడుతున్నారు. ఎన్నికలు రాకముందే బలాబలాలు, గెలుపోటములపై తర్జనభర్జన పడుతున్నారు. టిడిపి, జనసేన పొత్తు ఉంటే ఈ రెండు పార్టీలు బలంగా ఉన్న నియోజకవర్గాలను పరస్పరం త్యాగం చేయాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో జిల్లా రాజకీయాలు అంతుబట్టని విధంగా ఉన్నాయి.

ఒకవైపు ముందస్తు ఎన్నికల ప్రచారం, మరోవైపు రాజకీయ పార్టీలు కూడా ముందస్తు ఎన్నికలకు సన్నద్ధమవుతుండటం ఆసక్తికరంగా మారింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజా క్షేత్రంలో ముందుకు సాగుతున్నాయి. ఇక వామపక్షాలు, ప్రధానంగా సిపిఎం ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల గొంతుకలా గళమెత్తుతూ ఉద్యమాలు సాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధానంగా పొత్తులు ఏ విధంగా ఉంటాయో అనే చర్చ జోరందుకుంది. పవన్ కళ్యాణ్ భీమవరంలో బస చేసి గోదావరి జిల్లాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడం చర్చనీయాంశమైంది. జనసేన ఏ పార్టీతో కలిసి వెళ్తే.. జిల్లాలో ఏ ప్రాంతం నుంచి పోటీ చేస్తుంది.. పొత్తు లేకపోతే పరిస్థితి ఏమిటి, టిడిపి జనసేన కలిసి పోటీ చేస్తుందా, లేక బిజెపితోనే బరిలోకి దిగుతుందా వంటి పలు అంశాలపై చర్చ సాగుతోంది. జనసేన, టిడిపి పొత్తు కుదిరితే జిల్లాలో సీట్ల సర్దుబాటులో ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

త్యాగాలు తప్పవా..?

టిడిపి, జనసేన మధ్య పొత్తు కుదిరితే సీట్ల సర్దుబాటులో పార్టీలు త్యాగాలు చేయాల్సి పరిస్థితి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ గత ఎన్నికల్లో భీమవరం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాబోయే ఎన్నికల్లో భీమవరంలో జనసేన జెండా ఎగరవేయాలని ఆలోచనతో ఉన్న జనసేన ఈ సీటును వదిలే పరిస్థితి కనిపించట్లేదు. అలాగే నరసాపురంలో వైసిపి గెలుపొందగా జనసేన రెండో స్థానంలో నిలిచింది. రాబోయే ఎన్నికల్లో ఇక్కడి నుంచి జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ పోటీలో ఉంటారని పవన్ కళ్యాణ్ ప్రజల సమక్షంలో గతేడాది ప్రకటించారు. దీంతో ఈ రెండు నియోజకవర్గాలను జనసేన వదిలే పరిస్థితి కనిపించట్లేదు. దీంతో ఇక్కడ టిడిపి త్యాగం చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇక మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో టిడిపి పోటీ చేయాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైసిపి ప్రభంజనం సృష్టించినప్పటికీ ఉండి, పాలకొల్లు నియోజకవర్గాల్లో టిడిపి విజయం సాధించింది. అయితే పాలకొల్లులో మళ్లీ టిడిపి పోటీ చేసే అవకాశం ఉన్నప్పటికీ ఉండి స్థానాన్ని జనసేన ఆశిస్తుందని ప్రచారం జోరుగా సాగుతుంది. ఒకవేళ అదే జరిగితే టిడిపి ఉండి నియోజకవర్గాన్ని త్యాగం చేయాల్సి వస్తుంది. ఆచంట, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో రెండో స్థానంలో టిడిపి నిలవగా తణుకులో కేవలం 1.17 శాతం వ్యత్యాసంతో టిడిపి ఓటమి పాలైంది. ఈ నేపథ్యంలో ఆచంట, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలపై ఇరు పార్టీలు చర్చించుకుని అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జనసేన, టిడిపి పొత్తులో బిజెపి కలిస్తే పరిస్థితులు తారుమారయ్యే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో ఆయా సీట్లు ఆశిస్తున్న నేతల్లోనూ అయోమయం, గందరగోళం నెలకొంది.

లైన్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిని అందిస్తున్న నాయకులు

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - పెనుగొండ

పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణం తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన మండలంలోని సిద్ధాంతం సబ్ స్టేషన్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం నేత కె.రత్నరాజు మాట్లాడుతూ జగన్ ప్రమాణస్వీకారం రోజున విద్యుత్ ఛార్జీలను పూర్తిగా తగ్గించేస్తానని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. ఛార్జీలను తగ్గించకపోగా వివిధ రూపాల్లో భారాలు మోపడం దారుణమన్నారు. పెంచిన ఛార్జీలను తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. మరోవైపు సిద్ధాంతంలో లోఓల్టేజీ సమస్యతో పెదపేట, ఘటాలదిబ్బ, ప్రకాష్‌రావు కాలనీ, తానేష్‌పాలెం, గోదావరి గట్టు ప్రాంతం, నక్కవారిపాలెం, చెరువుపేట ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం లైన్ ఇన్‌స్పెక్టర్ కె.సుందర్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ మండల శాఖా కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు పులిదిండి రామారావు, నాయకులు కడలి త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యాన్ని సహించం : కలెక్టర్

ప్రజాశక్తి - ఆకివీడు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించేది లేదని కలెక్టర్ ప్రశాంతి హెచ్చరించారు. గురువారం ఆమె మండలంలోని పెదకాపవరం, చినకాపవరం గ్రామ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత ఆకివీడు మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ వాలంటీర్ల పనితీరు అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్ల పని పట్ల కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ సచివాలయ సిబ్బంది నిర్వహించిన సమీక్షా సమావేశంలో వాలంటీర్ల పనిలో లోపాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాలంటీర్ల పని మెరుగుపడకపోతే అందుకు సిబ్బంది బాధ్యత వహించాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. మరోసారి నిర్లక్ష్యం కన్పిస్తే చర్యలు తప్పవన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటింటా సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు ఎంతమందికి అందాల్సి ఉంది, ఇళ్ల నిర్మాణం ఎంతమంది చేపట్టారనే అంశాలను సమీక్షించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందలేదని ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. సచివాలయ సిబ్బంది, మండల మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. నెలరోజుల పాటు జరిగే జగనన్న సురక్షను పూర్తిస్థాయిలో ప్రజలకు అందించి విజయవంతం చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎస్‌ఎస్-ఎస్.వేణు, ఎంపిడిఓ కె.వాణి, తహాశీల్దార్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పోరుకేక'లో మేముసైతం

పాదయాత్రలో పాల్గొన్న పశ్చిమ గోదావరి జిల్లానేతలు

పాదయాత్రకు రాజకీయ, ప్రజాసంఘాల మద్దతు వెల్లువ

తరలొచ్చిన టిడిపి, జనసేన పోలవరం నియోజకవర్గ నేతలు

పదోరోజు కరుటూరు కాలనీ నుంచి బుట్టాయగూడెం వరకు సాగిన యాత్ర

రెడ్డి గణపవరంలో 200 కిలోమీటర్లు దాటిన 'పోలవరం పోరుకేక'

బుట్టాయగూడెంలో మహాపాదయాత్రలో కలిసిన ఉపయాత్ర

పలుచోట్ల బహిరంగ సభల్లో ప్రభుత్వాల తీరుపై మండిపడ్డ నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా కొనసాగుతున్న 'పోలవరం పోరుకేక' యాత్రకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు వెల్లువెత్తుతోంది. విజయవాడ, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, కాకినాడ వంటి దూరప్రాంతాల నుంచి సైతం ప్రజాసంఘాల నాయకులు తరలొచ్చి పాదయాత్రలో పాల్గొంటున్నారు. గురువారం జీలుగుమిల్లి మండలం కరుటూరు కాలనీలో ప్రారంభమైన యాత్ర ములగలంపల్లి, రౌతుగూడెం, రెడ్డిగణపవరం, పాలకుంటకాలనీ, రామారావుపేట, బుట్టాయగూడెం వరకు 17 కిలోమీటర్ల మేర సాగింది. పలుచోట్ల బహిరంగ సభలు జరగ్గా టిడిపి, జనసేన నాయకులు యాత్రకు సంఘీభావంగా కదలొచ్చారు. ములగలంపల్లి సభలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ మద్దతు ప్రకటిస్తూ నిర్వాసితుల సమస్యలపై మాట్లాడారు. బుట్టాయగూడెంలో జరిగిన సభలో జనసేన పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు తమ పార్టీ తరపున మద్దతు ప్రకటించడంతో పాటు నిర్వాసితుల పట్ల వైసిపి వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా విమర్శించారు. ఈ నెల 20న నెల్లిపాకలో ప్రారంభమైన పాదయాత్ర పదోరోజు గురువారం రెడ్డిగణపవరం చేరేసరికి 200 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. దీంతో పెద్దఎత్తున గ్రామాల జనం కదిలివచ్చి హారతులు పట్టి స్వాగతించారు. ఈ పాదయాత్రకు ఆశావర్కర్ యూనియన్‌తో పాటు ఐద్వా, గిరిజన సంఘాలు, విశాఖ స్టీల్‌ప్లాంటు యూనియన్ నాయకులు, పశ్చిమగోదావరి సిపిఎం శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు.

సాగుతున్న పోరుకేక పాదయాత్ర



కళాకారుల ప్రదర్శన

ఆయుధ కర్మాగారంతో దెబ్బతీయాలని చూస్తున్నారు

ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

జీలుగుమిల్లి మండలంలో ఆయుధ కర్మాగారం ఏర్పాటు ద్వారా రెండు పంచాయతీలను ఖాళీ చేయించాలని బిజెపి ప్రభుత్వం చూస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. అదానీ, అంబానీల కోసం ప్రజలను బలి చేయాలని చూస్తున్నారన్నారు. పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తునందన్నారు. ఈ గ్రామాలకు వచ్చిన నిర్వాసితులకు, స్థానికుల మధ్య గొడవలు పెడుతుందన్నారు. జల్లేరు ప్రాజెక్టు పేరులో మరికొన్ని గ్రామాలను ముంచాలని చూస్తుందన్నారు. అంతా నిర్వాసితులకు అండగా ఉండాలని, కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాల్లో రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్, విఆర్‌పురం ఎంపిపి కారం లక్ష్మి, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు వై.రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ప్రసన్నకుమార్, సిపిఎం జిల్లా నేతలు మొడియం నాగమణి, పి.మంగరాజు, కె.శ్రీనివాస్, వెంకట్రావు, ముత్యాలమ్మ, బుల్లమ్మ, అందుగుల ఫ్రాన్సిన్, ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, పి.కిషోర్ పాల్గొనగా సభలకు మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు.

అసమర్థ ప్రభుత్వం ఇది

చిర్రి బాలరాజు, జనసేన పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి

పోలవరం నిర్వాసితుల సమస్యలను వైసిపి అటకెక్కించిందని చిర్రి బాలరాజు విమర్శించారు. ఏ ఒక్కరికీ న్యాయం చేయలేదన్నారు. పునరావాసం ప్యాకేజీ రూ.10 లక్షలు, భూమికి రూ.5 లక్షలు హామీ కూడా నెరవేర్చలేదన్నారు. నిర్వాసితులను గోదావరిలో ముంచేస్తున్నారన్నారు. స్థానిక ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అసెంబ్లీలో ఒక్కసారి కూడా నిర్వాసితుల గురించి మాట్లాడలేదన్నారు. సిపిఎం చేపట్టిన పోలవరం పోరుకేక యాత్ర తమ సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో పాటు రానున్న రోజుల్లో మరింత సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

బుట్టాయగూడెంలో కలిసిన పోలవరం ఉపయాత్ర

పోలవరం నుంచి 28వ తేదీన ప్రారంభమైన పోలవరం ఉపయాత్ర గురువారం సాయంత్రానికి బుట్టాయగూడెం చేరుకుని ప్రధాన పోరుయాత్రలో కలిసింది. దీంతో బుట్టాయగూడెం కేంద్రం ఎర్ర రంగు పులుముకున్న మాదిరిగా ఎర్రజెండాలతో రెపరెపలాడింది. ప్రజానాట్యమండలి బృందం చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

పశ్చిమగోదావరి నుంచి తరలొచ్చిన నేతలు

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కరమే ప్రధాన ఎజెండగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో సాగుతున్న పోలవరం పోరుకేక పాదయాత్రకు పెద్దఎత్తున సంఘీభావం వెల్లువెత్తుతుంది. పదోరోజు గురువారం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దాదాపు 50 మంది పాదయాత్రకు సంఘీభావంగా తరలివచ్చారు. జిల్లా నాయకుల ముందు ఇప్పటికే పశ్చిమగోదావరి సిపిఎం జిల్లా కార్యదర్శి పాదయాత్రలో మమేకమై నడుస్తుండగా జిల్లా నాయకులు జి.గోపాలన్, కె.పెద్దిరాజు, డి.వాసుదేవరరావు, పివి.ప్రతాప్, ఎ.అజయ్‌కుమారి, పి.పూర్ణ, బి.జార్జి, కె.బాలరాజు, ఎం.త్రిమూర్తులు, ఎం.వైకుంఠరావు, జయప్రద, ఎం.రామాంజనేయులు, జవ్వాది శ్రీనివాస్, మల్లిపూడి ఆంజనేయులు, కెవిపిఎస్ నాయకులు క్రాంతిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు పెద్దిరాజు, పి.వాసు మరికొందరు పాదయాత్రకు సంఘీభావంగా తరలివచ్చారు.

200 కిలోమీటర్ల మైలు రాయి దాటిన పాదయాత్ర

పోలవరం సమస్యలే పరిష్కరంగా ప్రధాన ఎజెండాగా సాగుతున్న పోలవరం పోరుకేక పాదయాత్ర గురువారం 200 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. నెల్లిపాక నుంచి ఈ నెల పదో తేదీన ప్రారంభమైన పోలవరం పోరుకేక యాత్ర గురువారంతో పదో రోజుకు చేరుకుంది. బుట్టాయగూడెం మండలం రెడ్డి గణపవరంలో 200 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసుకోవడంతో స్థానిక గిరిజనులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఘన స్వాగతం పలికారు. 200 కిలోమీటర్లు అక్షరాలతో ఆర్అండ్‌బి రహదారిపై అంకెలు వేసి స్వాగతం పలికారు. పాదయాత్ర బృందానికి హారతులిచ్చి బొట్టు పెట్టి అంతా అభినందనలు తెలిపారు.

విశాఖపట్నం సిఐటియు నాయకుల మద్దతు

పోలవరం పోరుకేక పాదయాత్రకు విశాఖపట్నం నుంచి సిఐటియుకు చెందిన గిరిజన ఉద్యోగుల సంఘం, గిరిజన సంఘం నాయకులు సంఘీభావంగా తరలివచ్చారు. వీరిలో ఆర్.సత్యరావు, బి.తౌడన్న, గౌరిశంకర్, కోటి, స్వామి, కెఎం.శ్రీనివాస్, కుమార్, జగన్ పలువురు ఉన్నారు.

పాదయాత్రలో మాట్లాడుతున్న టిడిపి నేత బొరగం శ్రీనివాస్, సిపిఎం నేతలు వి.వెంకటేశ్వర్లు, ఎం.సీతారాం, మొడియం నాగమణి ఆశాల రాష్ట్ర నేత కె.ధనలక్ష్మి, జనసేన నేత చిర్రి బాలరాజు, అమరుల స్థూపం వద్ద నేతల నివాళి

రైల్వేగేటు మూసివేయకుండా పోరాటం

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో రైల్వేగేటు మూసివేతకు వ్యతిరేకంగా పోరాడతానని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కలెక్టర్ అనుమతితో రైల్వే అధికారులు గేటు మూసివేతకు ముందుకెళ్లడం దురదృష్టకరమన్నారు. దీనిపై గేటు వెంటనే మూసివేస్తే తాము రైలు పట్టాలపై కూర్చుని నిరవధిక దీక్ష చేపట్టాడతామని హెచ్చరించినట్లు చెప్పారు. ఇప్పటికే నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు దృష్టికి సమస్యను తీసుకెళ్లానన్నారు. ఆయన విదేశాల్లో ఉన్నా వెంటనే స్పందించి రైల్వే మంత్రితో మాట్లాడుతున్నారని చెప్పారు. పాలకొల్లులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినప్పుడు రైలు గేటు మూసివేతకు మున్సిపాల్టీ ఆమోదం తెలిపిందన్నారు. 2016లో గేటు మూసివేతకు రైల్వే అధికారులు చర్యలు తీసుకోగా నాటి ఎంపీ గంగరాజు ద్వారా గేటు మూసివేయకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అయితే కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం లాలూచీ పడటంతో తిరిగి రైల్వే అధికారులు మూసివేత నిర్ణయం చేశారని ఆరోపించారు. గేటు మూసివేయకుండా ఉండాలంటే ఆర్ఒబికి రైల్వేశాఖ ఖర్చు చేసిన రూ.14 కోట్లు ఇవ్వాల్సి ఉందని, ఆ సొమ్ము ఇవ్వలేమని రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేయడంతో గేటు మూసివేతకు కలెక్టర్ అనుమతి ఇచ్చారని తెలిపారు. రాబోయే రోజుల్లో తాము రైల్వే అండర్ పాస్ నిర్మాణం చేపడతామని ఎంఎల్ఎ చెప్పారు.



పోరుకేక పాదయాత్రలో కలిసిన ఉపయాత్ర

ప్రాజెక్టుకు, పునరావాసానికి

కేంద్రమే నిధులివ్వాలి

'పోలవరం పోరుకేక' ఉపయాత్రలో నేతలు

ప్రజాశక్తి - పోలవరం, బుట్టాయగూడెం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, నిర్వాసితుల పునరావాసానికి కేంద్ర ప్రభుత్వమే నిధులివ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం చేపట్టిన 'పోలవరం పోరుకేక' ఉపయాత్ర రెండో రోజు గురువారం ఉత్సాహంగా సాగింది. మండలంలోని కోండ్రుకోట పునరావాస కాలనీ నుండి ప్రారంభమైన యాత్ర ఎల్ఎన్‌డిపేట మీదుగా కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలంలోకి ప్రవేశించింది. కోండ్రుకోట పునరావాస గ్రామం, ఎల్ఎన్‌డి పేట గ్రామాల్లోని సెంటర్లలో సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు అధ్యక్షతన సభలు జరిగాయి ఈ సభల్లో శ్రీనివాస్ మాట్లాడుతూ నిర్వాసితులకు పునరావాసం కల్పించే చోటే 25 రకాల మౌలిక వసతులు కల్పించాలని 2013 భూ సేకరణ చట్టం చెబుతుందన్నారు. అయితే ఏ కాలనీలోనూ కనీస సౌకర్యాలు లేవన్నారు. కొండ్రుకోట పునరావాస గ్రామంలో శ్మశాన వాటిక లేకపోవడంతో గిరిజనులు చనిపోతే అంత్యక్రియలు ఎక్కడ నిర్వహించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నిర్వాసితులను అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పునరావాసానికి అయ్యే మొత్తం ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. లేనిపక్షంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు తామా ముత్యాలమ్మ మాట్లాడుతూ పునరావాస గ్రామాల్లో అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం, రాజ్యాంగం ఐదవ షెడ్యూల్, 1/70 చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో యాత్రకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. నేతలు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పునరావాసానికి అయ్యే ఖర్చులో 20 శాతం నిధులు కూడా ఇవ్వలేదన్నారు. పైగా పునరావాసం తమకు సంబంధం లేదని మోడీ ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపికి, గతంలో అధికారంలో ఉన్న టిడిపికి ఎన్నికల్లో ఓట్లు అవసరం వచ్చినప్పుడు మాత్రమే నిర్వాసితులు గుర్తుకొస్తారన్నారు. పోలవరం నిర్వాసితుల పోరాటానికి రాజకీయాలకు అతీతంగా మద్దతు ప్రకటించాలని కోరారు. బుట్టాయగూడెం మండలం కండ్రికగూడెం, నూతిరామన్నపాలెం, బొత్తప్పగూడెం, నందాపురం, కాపవరం, తూర్పు రేగులగుంట మీదుగా యాత్ర బుట్టాయిగూడెం చేరింది. ఆయా గ్రామాల్లో పాదయాత్రకు ఘన స్వాగతం లభించింది.

ప్రజాశక్తి
www.prajasakti.com

మాట్లాడుతున్న తోట సీతారామలక్ష్మి

వైసిపి హయాంలో దళితులకు భద్రత లేదు

టిడిపి జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ వారిని గాలికొదిలేశాడని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి విమర్శించారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలోని దళితులు, గిరిజనులపై తీవ్రస్థాయిలో నేరాలు జరుగుతుంటే నియంత్రించాల్సిన పోలీసులు ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నారన్నారు. వైసిపి మంత్రులు ఎస్‌సి, ఎస్‌టిలకు మేలు చేస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్నారని, రాష్ట్రంలో దళితులపై ప్రతిరోజూ దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి నిర్లక్ష్యం వహించడం దారుణమని విమర్శించారు. ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎద్దు యేసుపాదం మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టిన తర్వాత ఎస్‌సి, ఎస్‌టి మహిళలపై 233 అత్యాచారాలు జరిగాయన్నారు. ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మాత సురేష్ బాబు, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు. సమావేశంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, టిడిపి డ్వాక్రా అంగన్‌వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణమ్మ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లలో డ్రెయినేజీలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నామని పంచాయతీ కార్యదర్శి డి.సతీష్ కుమార్ గురువారం తెలిపారు. పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. నీరు నిల్వ ఉండడంతో జెసిబితో నీరు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది, శ్రీను ఉన్నారు.

గ్రామ సభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో జులై 1 నుంచి 20వ తేదీ వరకూ జరగనున్న జగనన్న సురక్ష గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపిడిఒ జగన్నాథరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఆయా గ్రామాల పర్యటన షెడ్యూల్‌ను ఆయన వెల్లడించారు. జులై 1న పెదమల్లం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, 4న కోడేరులో, 6న కరుగోరుమిల్లిలో, 11న పెనుమంచిలిలో, 13న భీమలాపురంలో, 15న కొడమంచిలి-1లో, 18న కొడమంచిలి-2లో, జులై 1న ఆచంట-1లో, 4న ఆచంట-2లో, 6న ఆచంట-3లో, 11న ఆచంట వేమవరం-1లో, 13న ఆచంట వేమవరం - 2లో, 15న అయోధ్యలంక, 18న వల్లూరు - 1లో, 20న వల్లూరు-2లో ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులతోపాటు, వాలంటీర్ల ద్వారా షెడ్యూల్ ప్రకారం ప్రజలకు సమాచారం అందించినట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

జర్మనీ విద్యాలయాలతో ఎస్ఆర్‌కెఆర్ ఒప్పందం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ఇంటర్న్‌షిప్ కోసం జర్మనీలో ఆ దేశ స్కాలర్‌షిప్, మంచి ఉద్యోగంతో పాటు ఉన్నత విద్యనభ్యసించేందుకు జర్మనీ విశ్వవిద్యాలయాలతో ఎంఒయు కుదుర్చుకున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ తెలిపారు. గత నెలలో జర్మనీ విశ్వ విద్యాలయాలను తమ కళాశాల ఆంగ్ల విభాగాధిపతి భూపతిరాజు నాగవెంకట లక్ష్మితో కలిసి సందర్శించినట్లు ఆయన వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం మీడియాకు అందించారు. ఇండో యూరోపియన్ సింక్రనైసేషన్ (ఐస్) సహకారంతో జర్మనీ యూనివర్సిటీల అధికారులతో సమావేశం జరిపి ఎంఒయు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా నాలెడ్జ్ ట్రాన్సుర్, స్కిల్ ట్రాన్సుర్‌తో పాటు ఉద్యోగావకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, డిజైన్ థింకింగ్, రోబోటిక్స్, 5జి వంటి అంశాలపై జర్మన్ అధ్యాపకులు నిర్వహించే ఆన్‌లైన్ ప్రోగ్రామ్స్‌కు హాజరవ్వాలని తెలిపారు. వేసవిలో జర్మనీకి సమ్మర్ ఇంటెన్సిప్ రెండు వారాలు హాజరైతే అక్కడ పరిశ్రమలు, ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్స్ వంటివి చూపించి పంపుతారన్నారు. ఇక్కడకు వచ్చిన తరువాత విద్యార్థి సమగ్రమైన ప్రాజెక్టు తయారుజేసి పంపితే దానికి కూడా సర్టిఫికెట్ ఉంటుందన్నారు. జర్మనీలో మాస్టర్ డిగ్రీ చేసేందుకు నెలకు రెండు లక్షల స్టైఫండ్‌తో అవకాశం కల్పిస్తారన్నారు.

జగన్నాథపురంలో వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని జగన్నాథపురం గ్రామంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోత్తూరి రామరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన టిడిపి నాయకులతో కలిసి ఆయన వంతెనను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్నాథపురంలో జెడ్‌పి ఉన్నత పాఠశాల సమీపంలో కూలిన వంతెనతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ వంతెన లేకపోవడంతో ఆక్వా చెరువులకు అవసరమైన సామగ్రిని తరలించేందుకు రైతుల ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులు ఈ వంతెనపై వెళ్తుండడంతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వంతెన నిర్మాణాన్ని వేగంగా చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట జోగి పండు, జక్కంశెట్టి బాలాజీ, విప్పర్తి వెంకటేశ్వరరావు, శ్యామ్‌కుమార్‌రాజు, జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, భూపతి బాబ్జి, తిరుమాని హేమంత్ ఉన్నారు.

నిమ్మల వ్యాఖ్యలపై మంత్రి విమర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఎంతో అవినీతికి పాల్పడ్డారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అంతకుముందు జరిగిన మీడియా సమావేశంలో మంత్రిని ఎర్రిపప్ప అన్నన్నారు. అయితే దానికి బదులుగా ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్‌సి ఫోన్ ద్వారా మంత్రి మీడియాతో మాట్లాడారు. నిమ్మల కొండ ఎర్రిపప్ప అని విమర్శించారు. టిడిపి హయాంలో నీరు - చెట్టు పథకం కింద ఎంఎల్‌ఎ ట్రీగార్డుల కోసం రూ.300 ఖర్చయితే వెయ్యి రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. లోకేష్ కూడా పప్పు సుద్ద అని విమర్శించారు.

అంకిత భావంతో పనిచేయాలి

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎస్‌సి, ఎస్‌టిల సమస్యల పరిష్కారంలో అకింత భావంతో పనిచేయాలని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యునిగా ఎంపికైన పొన్నమండల బాలకృష్ణ, చీకటిమిల్లి మంగరాజు గురువారం కొయ్యే మోషేనురాజును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మోషేనురాజు మాట్లాడుతూ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ ద్వారా ఎస్‌సి, ఎస్‌టిలకు వేగంగా న్యాయం జరిగేందుకు కృషి చేయాలన్నారు. వీరి వెంట నాయకులు పరమేశ్వరరావు, దుండి అశోక్ ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పాలకోడేరు: గొల్లలకోడేరు శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్ఐ నాళం శ్రీనివాసరావు గురువారం సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.33.800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

బిసిలు రాజ్యాధికారం వైపు అడుగులేయాలి

జనసేన మేనిఫెస్టోలో కల్లు వృత్తిదారులకు మద్యం పాలసీలో ప్రత్యేక రిజర్వేషన్ ఏర్పాటు

గ్రామీణ ప్రాంత యువతకు రూ.10 లక్షల రుణాలు

గౌడ శెట్టిబలిజ సమావేశంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - భీమవరం/భీమవరం రూరల్

బిసిలు రాజకీయ సాధికారత సాధించి రాజ్యాధికారం వైపు అడుగులేయాలని, దీనికి జనసేన అండగా ఉంటుందని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. ఐదు ఉపకులాలు కలిపి గౌడ సంఘంగా ఉండడం మంచిదేనని, ముఖ్యమంత్రి జగన్‌లాగా తాను విభజించి పాలించనని చెప్పారు. 2008 నుంచి అత్యధిక శాతం బీసీ కులాలు రాజ్యాధికారంలో ఉండాలని ప్రముఖంగా కోరుకున్నానని తెలిపారు. భీమవరంలో గౌడ శెట్టిబలిజ నాయకులతో పవన్ కళ్యాణ్ గురువారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సమావేశానికి జనసేనతోపాటు బిజెపి, టిడిపికి చెందిన ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ కులాలుగా విడివిడిగా ఉంటే గుర్తింపు ఉండదని, బిసిలుగా ఉంటేనే తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సర్దార్ గౌతమ్ లచ్చన్న స్ఫూర్తితో జనసేన బిసిల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. 33 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి ప్రభుత్వం తగ్గించడం దారుణమన్నారు. సంఖ్యా బలంగా ఉన్న కులాల్లో ఐక్యత తగ్గుతుందన్నారు. ఉప కులాలుగా ఉన్న శ్రీశైన, గౌడ, చిట్టి బలిజ, ఈరిగా, యాత కులాలను ఏకకృతం చేసి అందరూ కలిసికట్టుగా ఆలోచన చేయాలన్నారు. కేవలం నలుగురికి నామినేట్ పదవులిచ్చి బిసిలంతా అభివృద్ధి చెందారని చెప్పడం సరికాదన్నారు. గ్రామీణ ప్రాంత యువతకు చేయూతనిచ్చే విధంగా ప్రతి నియోజకవర్గంలో యువతకు రూ.10 లక్షల రుణాలు అందించేందుకు జనసేన కృషి చేస్తోందన్నారు. దేశం రాష్ట్రాల్లో ఎక్కడా సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు కాలేదని అన్నారు. మద్యపాన నిషేధం చేస్తామని చెప్పిన ప్రభుత్వం పూర్తిగా మద్యపానం నిషేధం చేయకుండా చీఫ్ లిక్కర్ అమ్మకాలు చేస్తోందని, దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. పాత మద్యం పాలసీ విధానం తీసుకొచ్చి కల్లు వృత్తిదారులకు ప్రత్యేక రిజర్వేషన్ కోట కల్పిస్తామని, ఈ అంశాన్ని జనసేన మేనిఫెస్టోలో పెడుతుందని తెలిపారు. తెలంగాణ మాదిరిగా ఈత వనాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే బిసిల కోరిక మేరకు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి జనసేన కృషి చేస్తుందన్నారు. బిసిలు రాజకీయంగా అభివృద్ధి చెంది సంపూర్ణ రాజ్యాధికారంలోకి రావాలన్నారు. బిసిలు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పిఎసి సభ్యులు నాదెండ్ల మనోహర్, ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు (చినబాబు), ముఖ్యనేతలు కనకరాజు సూరి, బొమ్మిడి నాయకర్, టిడిపి, బిజెపి బిసి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

ఏం కొనలేం.. ఏం తినలేం..!

ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు - అన్నీ వందపై మాటే - బెంబేలెత్తిపోతున్న జనం

ప్రజాశక్తి - ఆకివీడు

కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూరల ధరలు పేరు చెబితే ప్రజలు వణికిపోతున్నారు. ఇంకే కొంటాం.. ఇంకేం తింటాం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో 200 రూపాయలు మార్కెట్‌కు తీసుకెళ్తే సంచినిండా కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఆ డబ్బులకు రెండు కేజీలు మాత్రం వస్తున్నాయి. దీనికి కారణం అన్ని కూరగాయల ధరలూ సెంచరీ దాటడమే.. ఈ ధరలు చూసి సామాన్య, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వంకాయ, బెండకాయ కిలో 100 రూపాయలకు విక్రయిస్తున్నారు. బీట్రూట్, చిక్కుడుకాయలు ఏవైనా సరే రూ.150. ప్రతి కూరలో సామాన్యుడు తప్పనిసరిగా వాడే వాటిలో టమాటా ప్రధానమైంది. ప్రస్తుతం టమాటా ధర రూ.100 నుండి 120 రూపాయలకు విక్రయిస్తున్నారు. గత నెల రోజులుగా మెల్లిమెల్లిగా ధరలు పెరుగుతూ సెంచరీకి చేరాయి. మరో పది రోజులు ఇవే ధరలు కొనసాగే అవకాశం ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. దళారీ వ్యవస్థ వల్లే ఈ రకంగా ధరలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. అటు కొనుగోలుదారులకు, ఇటు రైతులకు మిగిలేది ఏమీ లేదని అంటున్నారు. గతంలో ఒకటి రెండు కూరగాయలు పాడైపోయినా ధరల రీత్యా తట్టుకోగలిగే వాళ్లమని, ఇప్పుడు తట్టుకునే పరిస్థితి లేదని చెబుతున్నారు. అందువల్లే ఎక్కువ రకాల కూరగాయలు కూడా అమ్మడం లేదని, ధరలు తగ్గితే తప్ప విస్తారంగా కూరలు వచ్చే పరిస్థితి లేదని అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుంటే తప్ప దళారీ వ్యవస్థ తగ్గే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

పవన్ కళ్యాణ్ సభకు ఆంక్షలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈనెల 30వ తేదీన భీమవరం అంబేద్కర్ సెంటర్లో వారాహి యాత్రలో భాగంగా చేపట్టనున్న జనసేన బహిరంగ సభకు ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు డిఎస్‌పి డి.శ్రీనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుండి జన సైనికులు, పవన్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉందని, అందువల్ల 30వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుండి నిబంధనలు విధించినట్లు తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్ ఇలా..

గుడివాడ - కలిదిండి - కాళ్ల - నుంచి భీమవరం, పాలకొల్లు వైపు వెళ్లే వాహనదారులు కోపల్లె హైస్కూల్ వద్ద డైవర్షన్ తీసుకొని, ఉండి, ఎన్ఆర్‌పి అగ్రహారం రోడ్డు, బైపాస్ రోడ్డు, బివి.రాజు విగ్రహం - మెంటేవారితోట బైపాస్ ఆర్‌టిసి డిపో మీదుగా భీమవరం, పాలకొల్లు వైపునకు వెళ్లాలి. అలాగే పాలకొల్లు నుంచి భీమవరం - గుడివాడ వైపు వెళ్లే వాహనదారులు ఆర్‌టిసి డిపో - నరసయ్య అగ్రహారం -కొడవల్లి రోడ్డు - మెంటేవారితోట బైపాస్ - బివి రాజు విగ్రహం - ఉండి రోడ్డులో జడ్డు బ్రహ్మాజీ కళ్యాణ మండపం (వై-జంక్షన్) మీదుగా ఉండి - గుడివాడ వైపుగా వెళ్లాలి. తాడేపల్లిగూడెం నుంచి భీమవరం - పాలకొల్లు వైపు వచ్చే వాహనాలు, గొల్లలకోడేరు - డివి.రాజు విగ్రహం - మెంటే వారితోట బైపాస్ - నర్సయ్య అగ్రహారం - ఆర్‌టిసి డిపో మీదుగా పాలకొల్లు వెళ్లాలి. తాడేపల్లిగూడెం నుంచి ఉండి - గుడివాడ - వైపు వచ్చే వాహనాలు, గొల్లలకోడేరు - బివి.రాజు విగ్రహం - వై జంక్షన్ బైపాస్ రోడ్డు - ఉండి రోడ్డు - గుడివాడ వైపు వెళ్లాలి. ఆర్‌టిసి డిపో నుంచి బైపాస్ మీదుగా బివి.రాజు విగ్రహం నుంచి తాడేపల్లిగూడెం వైపుగా, ఉండి రోడ్డు వైపుగా వెళ్లాలి. నరసాపురం-తుండుర్రు - తాడేరు వైపు నుంచి భీమవరం వచ్చే వాహనాలు వీరమ్మ పార్క్ నుండి పెద్ద మసీదు మీదుగా ఆర్‌టిసి బస్సు స్టాండ్, ఓవర్ బ్రిడ్జి వైపు వెళ్లాలి. గొల్లవానితిప్ప, కొమరాడ నుంచి భీమవరం, ఉండి, గుడివాడ వైపు వచ్చే వాహనాలు హన్సీ కళ్యాణ మండపం మీదుగా జువ్వలపాలెం రోడ్డు, ఎస్ఆర్‌కె కాలేజీ, పెదఅమిరం ఎన్‌టిఆర్ విగ్రహం కలెక్టర్ క్యాంపు కార్యాలయం రోడ్డు మీదుగా ఉండి, గుడివాడకు వెళ్లాలని పేర్కొన్నారు.

సభ సందర్భంగా వాహనాల పార్కింగ్ ప్రదేశాలు..

తాడేపల్లిగూడెం, కలిదిండి నుంచి వచ్చే వాహనాలు, బివి రాజు విగ్రహం దగ్గర ఉన్న విజయలక్ష్మి థియేటర్ పక్కరోడ్డు, డీమార్టు ఎదురుగా ఉన్న పార్కింగ్ స్థలంలో పెట్టుకోవాలి. తుందుర్రు నుంచి భీమవరానికి వచ్చే, యనమదుర్రు నుంచి వచ్చే టు వీల్స్ మున్సిపల్ కార్యాలయ పక్కన లూథరన్ హై స్కూల్ గ్రౌండ్‌లో, పాలకొల్లు నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలకు భీమవరం న్యూ బస్టాండ్ ఎదురుగా ఉన్న కేశవరావు హైస్కూల్ వద్ద పెట్టుకోవాలని తెలిపారు. పోలీస్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించకూడదని డిఎస్‌పి కోరారు.

డ్రెయినేజీలో పూడికతీస్తున్న వైనం

డ్రెయినేజీలో పూడికతీత పనులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు గాంధీబొమ్మ సెంటర్లో డ్రెయినేజీ పూడికతీత పనులు పారిశుధ్య కార్మికులు బుధవారం పంచాయతీ పాలకవర్గ సభ్యుల పర్యవేక్షణలో చేపట్టారు. మొగల్తూరులోని డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీనితోడు భూగర్భ డ్రెయినేజీ మరమ్మతులకు గురవ్వడంతో మురుగునీరు బయటకు వెళ్లడం లేదు. దీంతో రహదారిపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో పంచాయతీ పాలక వర్గ సభ్యులు పూడికతీత పనులు చేపట్టారు.

గురుభక్తికి ప్రతీక ఏకలవ్యుడు

ప్రజాశక్తి - ఆచంట

మహాభారతంలో గురు భక్తిని చాటి ఒక గొప్ప ఔన్నత్యం ఉన్న పాత్రను ఏకలవ్యుడు పోషించారని ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. కరుగోరుమిల్లిలో ఏకలవ్య జయంతి వేడుకలను వైసిపి నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎరుకుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ సాలశక్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్పంచి అల్లం పద్మావతి, వైసిపి గ్రామ ఇన్‌ఛార్జి ముత్యాల నాగేశ్వరరావు, ముత్యాల జగ్గారావు, సలాది శ్రీరంగరావు పాల్గొన్నారు.

ఆచంట: కేక్‌కట్ చేస్తున్న ఎఎంసి ఛైర్మన్

పాలకొల్లు : ఏకలవ్య జయంతి సందర్భంగా స్థానిక గాంధీబొమ్మల సెంటర్లో ఉన్న ఏకలవ్య విగ్రహానికి ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుభక్తికి ప్రతీక ఏకలవ్యుడు అన్నారు. అనంతరం పలువురు ఏకలవ్యుడి విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు.

పలు గ్రామాల్లో 'పంట మునిగింది.. పరిహారం ఇవ్వండి'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని అన్ని గ్రామాల్లో పంట మునిగింది.. పరిహారం ఇవ్వండి కార్యక్రమం ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సూచన మేరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో పంట నష్టం నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మేరకు పూలపల్లి, చందపర్రు, వెలివెలి, ఆగర్తిపాలెం, సగం చెరువు, గోరింటాడ, వరిధనం, కొత్తపేట, దిగమర్రు, పెద మామిడిపల్లి, భగ్గేశ్వరం, వడ్లవానిపాలెం, చింతపర్రు గ్రామాల్లో ఏర్పాటుచేసిన పంట నష్టం నమోదు కేంద్రాల వద్దకు వెళ్లిరైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోడి విజయభాస్కర్, మల్లుల రవీంద్రకుమార్, చల్లబోయిన సహదేవుడు మొదలైన నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమ సంఘం రాష్ట్ర సలహాదారుగా బంగారయ్య

ప్రజాశక్తి - ఆకివీడు

మండల వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య సంక్షేమ సంఘాల రాష్ట్ర సమాఖ్య సలహాదారిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సాయంత్రం విలేకరులకు వివరాలు తెలిపారు. ద్వారకా తిరుమలలో గురువారం రాష్ట్రస్థాయి వృద్ధుల సంక్షేమ సంఘాల సమాఖ్య జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్.నారాయణమూర్తి, కార్యదర్శిగా రామచంద్రరావును తిరిగి ఎన్నుకున్నారని, తనను ప్రత్యేక రాష్ట్ర సలహాదారుగా ఎన్నుకున్నారని చెప్పారు. బంగారయ్య ఎన్నిక పట్ల సంఘం మండల గౌరవాధ్యక్షులు, లయన్ డాక్టర్ ఎంవి సూర్యనారాయణ రాజు, కార్యదర్శి అడవి సుబ్బారావు, ఉపాధ్యక్షులు అప్పి రెడ్డి, ఆదినారాయణ, ప్రముఖులు అభినందించారు.

బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు

ప్రజాశక్తి - ఉండి

బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గురువారం ఉండిలో 151వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందుతున్న ప్రభుత్వ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారికి ఆర్థిక చేయూతనిచ్చి వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తూ విజయం సాధించిందని, అందుకు ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందన దానికి నిదర్శనమని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు 100 శాతం ప్రభుత్వ పథకాలను అందుకోవాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన వారు ఇంకా ఎవరైనా ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిథిలావస్థకు చేరిన ఉండి చిన్న వంతెనకు మండల పరిషత్ నుంచి 10 లక్షల రూపాయల నిధులు కేటాయించి వంతెన మరమ్మతులు చేయడం జరుగుతుందని తెలిపారు. రోడ్ల మరమ్మతుల నిమిత్తం మరో 10 లక్షల రూపాయలు కేటాయించడం జరుగుతుందని వారు తెలియజేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు రోజు అయినప్పటికీ ఈ కార్యక్రమానికి వచ్చి ఎంతో సహకారం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, జెడ్‌పిటిసి రణస్థుల కనకదుర్గ మహంకాళి, గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, పార్టీ సీనియర్ నాయకులు ఏడిద వెంకటేశ్వరరావు, గుల్లిపల్లి అచ్చారావు, రామచంద్రరావు, కరిమెరక శివ నాగరాజు పాల్గొన్నారు.

టిడిపి గౌడ సాధికార సమితి రాష్ట్ర సభ్యునిగా ధనరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి బిసి గౌడ సాధికార సమితి రాష్ట్ర సభ్యునిగా భీమవరం పట్టణానికి చెందిన టిడిపి నాయకుడు జంపన ధనరాజును నియమించినట్లు టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ప్రకటించారు. తన నియామకానికి సిఫార్సు చేసిన తోట సీతారామలక్ష్మిని ధనరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసే వరకూ పోరాడతానని తెలిపారు. తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ పదవులు పొందిన నాయకులు ఫ్లెక్సీలకు, కుర్చీలకు పరిమితం కాకుండా టిడిపి బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ డ్వాక్రా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, రాష్ట్ర కార్యదర్శి వెంద్ర శ్రీనివాస్, ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎద్దు ఏసుపాదం పాల్గొన్నారు.

మంత్రి కారుమూరిపై ఎంఎల్‌ఎ నిమ్మల ఫైర్

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రిగా రైతులకు న్యాయం చేయని కారుమూరి నాగేశ్వరరావు పాలకొల్లులో బుధవారం జరిగిన సభలో తనను ఏకవచనంతో తిట్టడం ఆశ్చర్యంగా ఉందని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో నిమ్మల గురువారం విలేకరులతో మాట్లాడారు. మంత్రి ఇటీవల రైతులను తిట్టినప్పుడు రైతులు తిరగబడితే తానే ఎర్రిపప్ప మంత్రిగా వర్ణించుకున్నారని తెలిపారు. తణుకు పట్టణంలో పిడిఆర్ బాండ్లు విడుదల చేసి రూ.300 కోట్లు మంత్రి అవినీతి చేయడాన్ని, తాడేపల్లి రాజప్రస్థానం కూడా ఆశ్చర్యపోయారని చెప్పారు. ఒక్క మున్సిపాల్టీ నుంచి ఇంత అవినీతి చేసిన కారుమూరి గురించి అందరికీ తెలుసని చెప్పారు. రైతులు ఇటీవల ధాన్యం అమ్ముకోడానికి ఎండలో ఎన్నో ఇక్కట్లు పడ్డారని, ఎదురు ప్రభుత్వంకు సొమ్ము చెల్లించి ఇక్కట్లు పడ్డారని గుర్తు చేశారు. టిడ్కో గృహాలు ఉచితం అని చెప్పి సొమ్ము కట్టించుకున్నారని, ఈ సొమ్ము జగన్ జేబులోకి వెళ్లిందని విమర్శించారు.

సస్యరక్షణపై అవగాహన కల్పించాలి

పెనుగొండ: రైతులకు నాణ్యమైన విత్తనాలపై అధికారులు అవగాహన కల్పించాలని రైతు సంఘం నాయకులు ఎ.హరేరామ్ తెలిపారు. వడలిలో సార్వాకు సంబంధించి 1318 రకాన్ని ఆకుమడులుగా వేశారని తెలిపారు. అవి కుళ్లిపోయి, ఎండిపోయి పనికిరాకుండా పోతున్నాయని తెలిపారు. వడలి గ్రామానికి చెందిన రైతు ఉప్పలపాటి వెంకట ప్రసాద్ తాను పండిస్తున్న 5 ఎకరాల్లో 50 కేజీల 1318 రకం ఆకుమడిగా వేసి 15 రోజులైందని తెలిపారు. ఇప్పటివరకూ ఎటువంటి పురుగు మందు గానీ ఎరువులు గానీ వేయలేదని తెలిపారు. ఆకుమడి ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మరలా ఆకుమడి వేయాలంటే 15 రోజులు సమయం పడుతుందని, దీంతో సమయం వృథా అవుతుందని తెలిపారు. తక్షణం వ్యవసాయ అధికారులు వడలి పరిసర గ్రామాల్లో పర్యటించి పంట రక్షణకు తగిన సూచన చేయాలని కోరారు. సస్యరక్షణ, వరి వంగడాల ఎంపిక విషయాల్లో అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.

విద్యార్థి అదృశ్యం.. కథ సుఖాంతం

పెనుమంట్ర: నెగ్గిపూడి గురుకుల పాఠశాలలో విద్యార్థి అదృశ్యమై మూడు రోజుల తరువాత క్షేమంగా ఇంటికి చేరిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రిన్సిపల్ చింతపల్లి సత్యవేణి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 27వ తేదీ తెల్లవారుజామున గురుకుల పాఠశాలలో ఆచంటకు చెందిన 9వ తరగతి చదువుతున్న విద్యార్థి దాసరి దిలీప్‌కుమార్ కనిపించకపోవడంతో వెంటనే విద్యార్థి తల్లిదండ్రులు పెద్దిరాజు, మణికుమారికి, అలాగే పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. దిలీప్‌కుమార్ ఆచూకీ కోసం తల్లిదండ్రులు, పోలీసులతో వెతికామని తెలిపారు. ఈ నెల 19వ తేదీన దిలీప్‌కుమార్‌ను తల్లిదండ్రులు పాఠశాలలో చేర్చారని, 26న అతని తల్లిదండ్రులు దిలీప్‌కుమార్‌ను చూడ్డానికి పాఠశాలకు వచ్చారని తెలిపారు. అయితే విద్యార్థి ఇక్కడ చదవడం తనకు ఇష్టం లేదని, ఇంటికి వచ్చేస్తానని చెప్పాడని తెలిపారు. ఇక్కడ చదవడం ఇష్టం లేకే వెళ్లిపోయాడని తెలిపారు. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి చేరినట్లు తల్లిదండ్రులు తెలిపారని ప్రిన్సిపల్ సత్యవేణి తెలిపారు.

సీసలిలో అన్నదానం

కాళ్ల: సీసలిలోని షిర్డీ సాయిబాబా మందిరంలో తొలి ఏకాదశి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు బాబాను దర్శించుకున్నారు. అనంతరం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామ కృష్ణంరాజు, కలవపూడి సొసైటీ అధ్యక్షుడు పి.దుర్గా ప్రసాదరాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, కాళ్ళ మండలం, జువ్వలపాలెం గ్రామం, డోర్ నెం. 2-19 గల శీలం శ్రీకాంత్, S/o. శీలం ఇమ్మానుయేలు అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. K9093841 గల పాస్‌పోర్టు ది. 18-2-2023వ తేదీన నాయొక్క పాస్‌పోర్టు రెన్యువల్ దరఖాస్తు చేసుకొను నిమిత్తము జువ్వలపాలెం నుండి కాళ్ళ మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు జారి పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది చిరునామాకు అందించగలరు.

శీలం శ్రీకాంత్
డోర్ నెం. 2-19, జువ్వలపాలెం
కాళ్ళ మండలం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 8121846844